

శివోహం

శైవక్షేత్రాల్లో వెల్లివిరిసిన భక్తి ● ఘనంగా మహాశివరాత్రి వేడుకలు ● పోటెత్తిన భక్తజనం


కపాలీశ్వర ఆలయంలో భక్తజన సందోహం


ఈషా వేడుకల్లో పాల్గొన్న భక్తజన సందోహం


కన్యకా పరమేశ్వరి ఆలయంలో దీప పూజలో నిర్వాహకులు


ఈషా యోగా కేంద్రంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్


దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

ప్యారీస్, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుప్రసిద్ధ శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల 'ఓంకారం' నాదంతో ఈ క్షేత్రాలు మార్మోగాయి. రామనాథపురం జిల్లా రామేశ్వరం పుణ్యక్షేత్రంలో ప్రసిద్ధిచెందిన రామనాథ స్వామి ఆలయం, తంజావూరు బృహదీశ్వర ఆలయం, దిండుగల్ జిల్లా పళని దండాయుధపాణి ఆలయం, మదురై జిల్లా తిరుప్పరంకుండ్రం మురుగన్ ఆలయం, స్వామిమలై స్వామినాధన్ ఆలయం, తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సుబ్రమణేశ్వరస్వామి ఆలయం, రాజధాని నగరంలోని మైలాపూర్ కపాలీశ్వరాలయం, ట్రిప్లికేన్‌లోని తిరువటీశ్వరాలయం తదితర ఆలయాల్లో ఉదయం నుంచే భక్తుల సందర్శన అధికమైంది. భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో బారులుతీరి స్వామివార్లను దర్శనం చేసుకున్నారు. రామేశ్వరంలో శివరాత్రి వేడుకల్లో ప్రధాన ఘట్టంగా శుక్రవారం వేకువజామున రామనాథస్వామి వారికి, పర్వతవర్ధిని అమ్మవారికి మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అదే విధంగా తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం కోలాహలంగా జరిగాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం వేకువజామున 3 గంటలకు మూలవిరాట్టుకు అభిషేకాలు , 5 గంటల నుంచి 2 గంటల వరకు లక్షార్చన చేశారు. విరుదునగర్, కోయంబత్తూర్, సేలం తదితర జిల్లాల్లో భక్తుల క్షీరకలశాల ఊరేగింపు జరిగింది. విరుదునగర్ జిల్లా శ్రీ విల్లిపుత్తూర్ సమీపంలోని చదురగిరి కొండపై సుందరచందన మహాలింగ ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు జిల్లాలకు చెందిన వేలాది మంది భక్తులను అటవీ శాఖ అధికారులు మెట్ల దారి మీదుగా కొండపైకి అనుమతించారు. శివరాత్రి సందర్భంగా ఈ ప్రాంతంలో భద్రత కట్టుదిట్టం చేశారు. అదే విధంగా కోయంబత్తూరులోని ఈషా కేంద్రంలో జరిగిన మహాశివరాత్రి వేడుకలకు ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్కర్, గవర్నర్ ఆర్.ఎన్.రవి తదితరులు హాజరయ్యారు.

తాంబరం - ముడిచ్చూరు - శ్రీపెరుంబుదూరు

ఫోర్‌వే ప్రారంభం

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రహదారుల శాఖ ఆధ్వర్యంలో తిరునల్వేలి, తెన్‌కాశి, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువణ్ణామలై జిల్లాల్లో రూ.499.69 కోట్లతో నిర్మించిన నాలుగు ప్రధాన రహదారులు, రూ.18.57 కోట్లతో నిర్మించిన ఓ రహదారి వంతెనకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ఉదయం ప్రారంభోత్సవం చేశారు. చెన్నై సచివాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తిరునల్వేలి, తెన్‌కాశి జిల్లాల్లో రూ.196.84 కోట్లతో నిర్మించిన తిరునల్వేలి - సెంగోట - కొల్లమ్ ఫోర్‌వే రహదారిని, కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూరు జోన్‌లో రూ.108.50 కోట్లతో నిర్మించిన తాంబరం - ముడిచ్చూరు - శ్రీపెరుంబుదూరు ఫోర్‌వే రహదారిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఇదే విధంగా రూ.54.35 కోట్లతో పుక్కతురై - ఉత్తిరమేరూరు మధ్య నిర్మించిన ఫోర్‌వే రహదారిని తిరువణ్ణామలై జిల్లాలో రూ.140 కోట్లతో నిర్మించిన కడలూరు - చిత్తూరు ఫోర్ వే , తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి తాలూకా నాగలాపురం రోడ్డులో కుశస్థలివాగుపై రూ.18.57 కోట్లతో నిర్మించిన ఫ్లైఓవర్‌ను ఆయన ప్రారంభించారు. రహదారుల శాఖకు టీఎన్‌పీఎస్సీ పరీక్షల ద్వారా ఎంపికైన 219 మంది జూనియర్ డ్రాఫ్ట్‌మేన్ల ఉద్యోగ నియామక పత్రాలను కూడా ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాపనుల శాఖ మంత్రి ఈవీ వేలు, రహదారులు, మినీ ఓడరేవుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌యాదవ్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి పథకం ప్రణాళికా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఆర్ సెల్వరాజ్, రహదారుల శాఖ ప్రిన్సిపల్ డైరెక్టర్ ఎస్. శాంతి, చీఫ్ ఇంజనీర్ ఇరా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కలెక్టర్లకు పతకాలు...

ఇదిలా ఉండగా సామాజిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆడ శిశువుల జననాలను పెంచేలా ప్రోత్సహించిన మూడు జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి స్టాలిన్ పతకాలను అందజేశారు. ఆ మేరకు రామనాధపురం జిల్లా కలెక్టర్‌కు విష్ణుచంద్రన్‌కు స్వర్ణపతకం, కాంచీపురం జిల్లా కలెక్టర్ కలైసెల్వి మోహన్‌కు రజతం, ఈరోడ్ జిల్లా కలెక్టర్‌కు రాజగోపాల్ సుంకరకు కాంస్య పతకాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతా జీవన్, ఆ శాఖ కార్యదర్శి జయశ్రీ మురళీధరన్, సామాజిక సంక్షేమ శాఖ సంచాలకులు వి.అముదవల్లి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ భవనాల ప్రారంభోత్సవం...

సచివాలయంలో జరిగిన మరొక కార్యక్రమంలో రూ.143.69 కోట్లతో నిర్మించిన చేపల దిగుమతి కేంద్రాలు, చేపల సంతానోత్పత్తి కేంద్రాలు, తమిళనాడు డాక్టర్ జే జయలలిత మత్స్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్మించిన భవనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ మంత్రి అనితా రాధాకృష్ణన్, వెటర్నరీ, డైరీ, ఫిషరీష్ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి మంగత్‌రామ్ శర్మ, ముఖ్య కార్యదర్శి సున్‌సొంగమ్ ఐడక్ సిరు, డాక్టర్ జే జయలలిత మత్స్య విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఎస్.ఫెలిక్స్ పాల్గొన్నారు.

ఎండీఎంకేకి ఒక్క సీటే

స్టాలిన్ సమక్షంలో కుదిరిన ఒప్పందం

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలో రెండు సీట్ల కోసం పట్టుబట్టిన ఎండీఎంకే చివరకు ఒక స్థానానికే సరిపెట్టుకుంది. ఈ మేరకు శుక్రవారం ఉదయం డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. ఈ ఎన్నికల్లో ఎండీఎంకే గెలిచేందుకు అవకాశాలున్న కాంచీపురం, కడలూరు, ఈరోడ్, విరుదునగర్, తిరుచ్చి, మైలాడుదురై నియోజకవర్గాలలో రెండు నియోజకవర్గాలను తమ పార్టీకి కేటాయించాలని ఎండీఎంకే పట్టుబట్టింది. డీఎంకే అధిష్టానం కుదరదని చెప్పటండంతో ఒక లోక్‌సభ సీటు, ఒక రాజ్యసభ సీటు కేటాయించాలని కోరింది. ఆ దిశగా సీట్ల సర్దుబాట్లపై డీఎంకే కమిటీ, ఎండీఎంకే కమిటీ సభ్యుల నడుమ మూడు విడతలుగా చర్చలు జరిగినా సీట్ల కేటాయింపు ఖరారు కాలేదు. చివరకు స్టాలిన్ సమక్షంలో సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చింది. ఒక్కసీటు డీఎంకే అధిష్టానం కేటాయించింది. ఈ విషయమై అన్నా అరివాలయం బయట వైగో విలేఖరులతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకేకు అండగా ఉంటూ కూటమి విజయానికి పాటుపడతామన్నారు. ఎండీఎంకే పోటీ చేయనున్న నియోజకవర్గం గురించి మిత్రపక్షాలతో చర్చించిన మీదట డీఎంకే అధిష్టానం ప్రకటిస్తుందన్నారు. రాజ్యసభ సీటు కోసం స్టాలిన్‌తో చర్చించలేదని, రాజ్యసభ ఎన్నికలు సమీపించినప్పుడు ఆ విషయమై ప్రస్తావించాలని అనుకుంటున్నామని వైగో తెలిపారు.


అన్నా అరివాలయంలో సీట్ల సర్దుబాట్ల ఒప్పంద పత్రాలతో వైగో, సీఎం స్టాలిన్

డీపీఐకి రెండు సీట్లు : లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలోని డీపీఐకి రెండు సీట్లు ఖరారైంది. గత కొంత కాలంగా సీట్ల పంపకాలపై రెండు పార్టీల మధ్య కొనసాగిన ప్రతిష్టంభన ఎట్టకేలకు తొలగిపోయింది. గతంలాగే డీపీఐ రెండు నియోజకవర్గాలలో పోటీ చేయడానికి అంగీకరించింది. ఆ మేరకు అన్నా అరివాలయంలో సీఎం స్టాలిన్, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ విషయమై డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ మాట్లాడుతూ కూటమిలోని ఇతర మిత్రపక్షాలతో చర్చలు ముగిసిన తర్వాత నియోజకవర్గాల జాబితాను డీఎంకే అధిష్టానం విడుదల చేస్తుందని తెలిపారు. తమ పార్టీ గుర్తుపైనే పోటీ చేయడానికి డీఎంకే అంగీకరించిందని, దీనితో కుండ గుర్తు కోసం ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

రేపే కాంగ్రెస్ సీట్ల ఖరారు...

ఇదిలా ఉండగా డీఎంకే కూటమిలో ప్రధాన మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు ఆదివారం సీట్ల కేటాయింపు ఖరారవుతుంది. మక్కళ్‌నీదిమయ్యంతో గురువారం డీఎంకే సీట్ల సర్దుబాట్ల కమిటీ సభ్యులు చర్చలు జరగటంతో ఆ పార్టీకి ఒక సీటు కేటాయించేందుకు అంగీకరించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కోరుతున్న పది సీట్లు కేటాయించడానికి వీలులేదని డీఎంకే వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో ఈ సారి తమకు పది సీట్లు కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు పట్టుబడుతున్నారు. ఈ పరిస్థితుల్లో రెండు పార్టీల మధ్య సీట్ల సర్దుబాట్లు ఆదివారం ఖరారవుతుందని డీఎంకే నేతలు తెలిపారు.

తమిళగ వెట్రి కళగంలో సభ్యత్వకార్యక్రమానికి శ్రీకారం

తొలి సభ్యుడిగా నమోదు చేసుకున్న విజయ్


సభ్యత్వ నమోదు సందర్భంగా విజయ్ విడుదల చేసిన ఫొటో

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగంలో సభ్యత్వ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ప్రారంభమైంది. ఆ పార్టీ తొలి సభ్యుడిగా విజయ్ తన పేరు నమోదు చేసుకున్నారు. 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికలపై ప్రత్యేక దృష్టిసారిస్తూ ఫిబ్రవరిలో నటుడు విజయ్ రాజకీయ పార్టీని ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పార్టీ సిద్ధాంతాలు, పార్టీ పతాకం, చిహ్నం రూపకల్పనలో ఆయన నిమగ్నమయ్యారు. అదే సమయంలో పార్టీలో సుమారు రెండు కోట్ల మందికి సభ్యత్వం కల్పించాలని సంకల్పించారు. ఆ మేరకు పనయూరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక యాప్ ద్వారా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టి, తొలి సభ్యుడిగా విజయ్ తన పేరును నమోదు చేసుకున్నారు. ఆ సందర్భంగా ఆయన ఓ వీడియో వెలువరించారు. అందులో 'తమిళగ వెట్రి కళగంలో సభ్యుడిగా పేరు నమోదు చేసుకున్నాను మీరు కూడా నమోదు చేసుకోండి' అంటూ పిలుపునిచ్చారు.

ఉద్రిక్తంగా సాగిన పుదుచ్చేరి బంద్

ఇండియా కూటమి నేతల అరెస్టు ● రాజ్‌భవన్ ముట్టడికి యత్నం ● బాలిక హత్యకు న్యాయం కోరుతూ ఆందోళన



రాజ్‌భవన్ సమీపాన ధర్నా చేస్తున్న ఇండియా కూటమి నేతలు, కార్యకర్తలు - ఓ మహిళా కార్యకర్తను అడ్డుకుంటున్న పోలీసులు

అడయార్, మార్చి 8: పుదుచ్చేరిలో తొమ్మిదేళ్ళ బాలికపై అత్యాచారం చేసి, హత్య చేసిన దారుణ ఘటనకు నిరసనగా ఇండియా కూటమిలోని భాగస్వామ్యపక్షాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రంలో జరిగిన బంద్ పలు ప్రాంతాల్లో ఉద్రిక్తంగా మారింది. ఎస్పీ కార్యాలయంతో పాటు రాజ్‌భవన్ ముట్టడికి ఆందోళనకారులు ప్రయత్నించగా, వారిని పోలీసులు అడ్డుకున్నారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వారికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ బంద్‌లో డీఎంకే, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా పాల్గొన్నారు. బంద్ కారణంగా ఉదయం నుంచి ప్రజా రవాణా స్తంభించిపోయింది. పుదుచ్చేరి రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సులన్నీ డిపోలకే పరిమితమయ్యాయి. ఆటో, టెంపో, ప్రైవేట్ క్యాబ్ డ్రైవర్లు కూడా బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలపడంతో పుదుచ్చేరి రహదారులన్నీ బోసిపోయాయి. అనేక ప్రాంతాల్లో వ్యాపారులు కూడా స్వచ్ఛందంగా బంద్ పాటించారు. పుదుచ్చేరిలోని రాజా థియేటర్ జంక్షన్‌లో ఇండియా కూటమి నేతలంతా ధర్నా చేస్తూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిపక్ష నేత శివ, ఎంపీ వైద్యలింగం నేతృత్వంలో దాదాపు 400 మందికి పైగా డీఎంకే, కాంగ్రెస్, ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, ఎండీఎంకేలకు చెందిన నేతలు, కార్యకర్తలంతా కలిసి నెహ్రూ వీధి మీదుగా ఎస్పీ కార్యాలయం వరకు ఊరేగింపుగా వెళ్ళి ఈస్ట్ ఎస్పీ కార్యాలయ భవాన్ని ముట్టడికి ప్రయత్నించారు. అయితే ఆందోళనకారులు ప్రవేశించకుండా పోలీసులు బారికేడ్లను రోడ్డుకు అడ్డంగా పెట్టారు. దీంతో ఆందోళనకారులు రాజ్‌భవన్ ముట్టడికి ప్రయత్నించారు. అయితే, అప్పటికే ముందు జాగ్రత్త చర్యగా పోలీసులను మొహరించడంతో ఆందోళనకారులు రోడ్డుపైనే బైఠాయించారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఆయా పార్టీల మహిళా విభాగం నేతలు బారికేడ్లను దాటుకుని, రాజ్‌భవన్ కాంపౌండ్ వాల్ వరకు వెళ్ళారు. వారిని పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. అయినప్పటికీ.. ఆందోళన విరమించేందుకు నిరాకరించిన ప్రతిపక్ష నేత శివ, ఎంపీ వైద్యలింగం, డీఎంకే ఎమ్మెల్యేలు అనిపాల్ కెన్నడి, సెంథిల్ కుమార్, సంపత్, మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి కాంగ్రెస్ ఎమ్మెల్యే వైద్యనాథన్ సహా దాదాపు 500 మందిని అరెస్టు చేశారు. అక్కడ నుంచి కదిలేందుకు నిరాకరించిన హిజ్రాలపై పోలీసులు స్వల్ప లాఠీచార్జ్ చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే, బంద్ సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టం చేశారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా

12న మానవహారం

● మహిళా దినోత్సవ వేడుకల్లో మాజీ సీఎం ఈపీఎస్



మహిళా దినోత్సవ వేడుకల్లో పళనిస్వామిని సత్కరిస్తున్న మహిళా విభాగం సభ్యులు - ఎంజీఆర్ మాళిగై ప్రాంగణంలో మహిళల ప్రదర్శన

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అడ్డూ అదుపూలేకుండా సాగుతున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వ్యాపారాలను నిరోధించడంలో విఫలమైన డీఎంకే ప్రభుత్వాన్ని ఖండిస్తూ ఈ నెల 12న మానవహారం ఆందోళన నిర్వహించనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ప్రకటించారు. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగై వద్ద శుక్రవారం ఉదయం అన్నాడీఎంకే మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. మహిళా విభాగం నాయకురాలు, మాజీ మంత్రి వలర్మతి పర్యవేక్షణలో జరిగిన వేడుకల్లో 76 కేజీల భారీ కేక్‌ను ఈపీఎస్ కట్ చేసి మహిళా విభాగం సభ్యులందరికీ పంచారు. ఈ వేడుకల్లో ఎంపీలు తంబిదురై, సీవీ షణ్ముగం, పార్టీ ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్‌మగన్ హుసేన్, సీనియర్ నేతలు కేపీ మునుసామి, నత్తం విశ్వనాధన్, బెంజమిన్, డి.జయకుమార్, గోకుల ఇందిరా, గాయత్రీ రఘురామ్, జిల్లా శాఖ కార్యదర్శులు విరుగై రవి, బాలగంగా, ఆదిరాజారామ్,కేపీ కందన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మాదక ద్రవ్యాల వినియోగం అధికమైందని తాను పలుమార్లు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశానని, పాఠశాలలు, కళాశాలల వద్ద మత్తు పదార్థాలను అమ్ముతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల ఉత్తరాదిన భారీ స్థాయిలో పట్టుబడిన మాదక ద్రవ్యాల కేసుతో డీఎంకే నాయకుడి సంబంధం ఉన్నట్లు పోలీసు ఉన్నతాధికారులు చేసిన ప్రకటన పాలకపక్షంలో ఎలాంటి స్పందన కలిగించలేదని, ఆ నాయకుడిని పార్టీ నుండి తొలగించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, అమ్మకాలను నిరోధించలేని అచేతన డీఎంకే ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఈ నెల 12న మానవ హారం ఆందోళన జరుపుతామని, రాజ్‌భవన్‌కు వెళ్ళి గవర్నర్‌కు వినతి పత్రం కూడా సమర్పిస్తామని ఈపీఎస్ వివరించారు.

సమాచార ధ్వని

11న రాజధాని కళాశాలలో శ్రీనాథుడిపై ఉపన్యాస కార్యక్రమం

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజధాని కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 11న 'నూత్న మార్గదర్శకుడు శ్రీనాథుడు' అనే అంశంపై ఆ శాఖ విశ్రాంతాచార్యులు ఆచార్య ఎల్.బి. శంకరరావు ప్రసంగించనున్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఆసమావేశానికి తెలుగుశాఖ సహాయాచార్యులు డా.ఎం. మురళి స్వాగతోపన్యాసం చేశారు. సభకు శాఖాధ్యక్షులు డా. ఎస్.ఎలిజబెత్ జయకుమారి అధ్యక్షత వహిస్తా రు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఎంఏ మొదటి సంవత్సరం విద్యార్థిని అనురాధ వందన సమర్పణ చేస్తారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు పేర్కొన్నారు.

నేడు రేషన్‌కార్డు గ్రీవెన్స్

ఐసిఎఫ్,మార్చి8:రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో రేషన్‌కార్డు గ్రీవెన్స్ శనివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు జరుగనుంది. నగరంలో ఉన్న ఆహార వస్తువుల సరఫరా, వినియోగదారుల భద్రత శాఖ 19 మండల సహాయ కమిషనర్ కార్యాలయాల్లో నిర్వహించనున్న శిబిరాల్లో వినియోగదారులు పాల్గొని, రేషన్‌కార్డుల్లో పేర్ల తొలగింపు, చేర్పులు, చిరునామా మార్పులు, మొబైల్ నెంబరు నమోదు సహా వివిధ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని అధికారులు తెలిపారు.

డిప్లొమో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్,మార్చి8:తమిళపరిశోధన సంస్థలో విద్య ఉపకారవేతనంతో తమిళ్ ఎథియాలజీ, లిటరరీ ఒక ఏడాది డిప్లొమోకోర్సులో చేరేందుకు ఏప్రిల్ 5వతేదివరకు విద్యార్థుల దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను www.ulakaththamizh.in వెబ్‌సైట్‌లో లేదా నేరుగాను పొందవచ్చు. అడ్మిషన్ ఫీజు రూ.3,200. టెన్త్ ఉత్తీర్ణులై ఉండాలి. వయోపరిమితి లేదు. రాతపరీక్ష ఏప్రిల్ 12వ తేది ఉదయం 11 గంటలకు ప్రపంచ తమిళ పరిశోధన సంస్థలో జరుగనుంది. తరగతులు ప్రారంభమయ్యే తేదీ త్వరలో వెల్లడిస్తారు. వారంలో మూడు రోజులు తరగతులు నిర్వహించి, ప్రతి ఏటా 10 మంది విద్యార్థులకు నెలకు రూ.3,000 ఉపకారవేతనం అందజేస్తారు.

విదేశీ ఉద్యోగావకాశాలు

ఐసిఎఫ్, మార్చి 8: ఇంగ్లాండ్, జర్మనీ, జపాన్ దేశాల్లో పనిచేసేందుకు నర్సులు దరఖాస్తు చేసుకోవాలని విదేశీ ఉద్యోగావకాశాల సంస్థ అధ్యక్షుడు మహేశ్వరన్ తెలిపారు. ఔత్సాహికులు తమ స్వీయ వివరాలు omcflt.24@gmail.com ఈ మెయిల్‌కు పంపాలి. మరిన్ని వివరాలకు www.omcmanpower.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

ఆవిన్ మిల్క్ బిస్కెట్ల విక్రయాలు నిలిపివేత

ఐసిఎఫ్, మార్చి 8: ఆవిన్ సంస్థ మిల్క్ బిస్కెట్ల విక్రయాలు నిలిపివేసింది. ఈ సంస్థ వెన్న, నెయ్యి, పాలకోవా, బిస్కెట్, కుల్ఫీ, ఐస్‌క్రీమ్ వంటివి విక్రయిస్తోంది. ఈ నేపథ్యంలో, గత ఏడాది రూ.12ల ఆవిన్ మిల్క్ బిస్కెట్లకు ప్రజాదరణ తగ్గడంతో వాటి విక్రయాలు నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సిద్ధ వైద్య పరిశోధనలకు ఒప్పందం

ఐసిఎఫ్, మార్చి 8: చెన్నై కేంద్ర సిద్ధ వైద్య పరిశోధన సంస్థ, జాతీయ వైద్య సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. పంజాబ్ రాష్ట్రంలో జరిగిన కార్యక్రమంలో రెండు సంస్థల డైరెక్టర్లు ఒప్పందపత్రంలో సంతకాలు చేశారు. ఈ విషయమై చెన్నై కేంద్ర సిద్ధ వైద్య పరిశోధన సంస్థ డైరెక్టర్ డా.ముత్తుకుమార్ మాట్లాడుతూ.. వైద్యం, పరిశోధన, విద్య వంటి వాటిలో యూజీ, పీజీ సిద్ధ వైద్యుల భవిష్యత్ ప్రణాళికలకు ఈ ఒప్పందం ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు.

ప్రాక్టికల్స్ నిబంధనల్లో మార్పులు

ఐసిఎఫ్, మార్చి 8: ప్లస్ వన్, ప్లస్ టూ తరగతుల ప్రాక్టికల్స్ నిబంధనల్లో మార్పులు చేశారు. ప్లస్ వన్, ప్లస్ టూ థియరీ విద్యార్థులు కొన్ని సమయాల్లో ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాలేకపోతున్నారు. ఈ విద్యార్థుల థియరీ, ఓరల్ మార్కులు కలిపి 35 మార్కులకు తక్కువగా ఉంటే ఫెయిల్ చేస్తున్నారు. వీరు మళ్లీ థియరీ, ప్రాక్టికల్ పరీక్షల్లో పాల్గొంటేనే ఉత్తీర్ణులయ్యేందుకు అవకాశముంది. ఈ విద్యార్థులు రాబోయే రోజుల్లో థియరీలో కనిష్టంగా 15 మార్కులు పొందితే, సప్లిమెంటరీ పరీక్ష సమయంలో ప్రాక్టికల్ పరీక్షలో మాత్రమే పాల్గొంటే చాలు. వారి కింద థియరీ పరీక్ష మార్కులు కలిపి మార్కుల జాబితాఆ అందజేయనున్నట్లు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది.

నేటినుంచి శాంతోమ్‌లో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, మార్చి 8: స్థానిక శాంతోమ్ హైరోడ్డు-కారణీశ్వర ఆలయ వీధి జంక్షన్‌లో లైట్ హౌస్ మెట్రో రైల్వేస్టేషన్ నిర్మాణపనులు చేపట్టనుండడంతో శనివారం నుంచి వారం రోజులు ట్రాఫిక్ మార్పులుంటాయని పోలీసులు తెలిపారు.

- గాంధీ విగ్రహం నుంచి శాంతోమ్ హైరోడ్డు మీదుగా వచ్చే వాహనాలు లైట్ హౌస్ జంక్షన్‌లో ఎడమవైపు లూప్ రోడ్డు మీదుగా వెళ్లాలి.
- కారణీశ్వరాలయ వీధి జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు ఎడమవైపు తిరిగి లైట్ హౌస్ మీదుగా వెళ్లాలి.
- కారణీశ్వరాలయం వీధి నుంచి పాపనాశం శివన్ రోడ్డు జంక్షన్ మీదుగా వాహనాలు వెళ్లేందుకు అనుమతి లేదు.
- లూప్ రోడ్డు, శాంతోమ్ హైరోడ్డు మూడు నెలల వరు వన్‌వేగా ఉంటుంది.

నుంగంబాక్కంలో...

స్థానిక నుంగంబాక్కం స్టెర్లింగ్ రోడ్డు అన్నా ఫ్లై ఓవర్ ప్రాంతంలో మెట్రోరైలు పనులు చేపట్టనుండడంతో ఈ నెల 11 నుంచి వారం రోజులు ట్రాఫిక్ మార్పులు అమలులో ఉంటాయని పోలీసులు తెలిపారు.

- చెట్‌పెట్ నుంచి జెమిని ఫ్లై ఓవర్ మీదుగా వచ్చే వాహనాలు, కాలేజ్ రోడ్డు-హడోస్ రోడ్డు-ఉత్తమర్ గాంధీ రోడ్డు మీదుగా వెళ్లాలి.
- జెమిని ఫ్లై ఓవర్ నుంచి వచ్చే వాహనాలు ఉత్తమర్ గాంధీ రోడ్డు-కోడంబాక్కం హైరోడ్డు మీదుగా వళ్లువర్ కోట్టం వెళ్లాలి.
- అమింజికరై మీదుగా వెళ్లే వాహనాలు ట్యాంక్ బండ్ రోడ్డులో ఎడమవైపు తిరిగి నెల్సనమాణిక్యం రోడ్డు మీదుగా వెళ్లాలి.
- వళ్లువర్‌కోట్టం నుంచి జెమిని ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లే వాహనాలు వళ్లువర్‌కోట్టం హైరోడ్డు-ఉత్తమర్ గాంధీ రోడ్డు మీదుగా అన్నా ఫ్లై ఓవర్ వెళ్లవచ్చు. అలాగే, వళ్లువర్‌కోట్టం సిగ్నల్‌లో కుడివైపు తిరిగి తిరుమలై పిళ్లై రోడ్డు-జీఎన్ చెట్టి రోడ్డు మీదుగా అన్నా ఫ్లై ఓవర్ చేరుకోవచ్చు.

షోళింగర్ ఆలయంలో రోప్‌కార్ సేవలు ప్రారంభం

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర శత వైష్ణవ దివ్యక్షేత్రాల్లో ఒకటైన షోళింగర్ యోగనరసింహ స్వామివారి పర్వతాలయానికి శుక్రవారం రోప్‌కార్ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ సేవలను చెన్నై సచివాలయం నుంచి ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ ఆలయానికి వెళ్లేందుకు కొండదిగువ నుండి 1306 మెట్ల దారి ఉంది. పర్వతాలయానికి రోప్‌కార్ సేవలకు డీఎంకే ప్రభుత్వం రూ.9.3 కోట్ల మేర కేటాయించి, పనులు పూర్తికాగా ముఖ్యమంత్రి స్టాలిన్ రోప్‌కార్ సేవలను ప్రారంభించారు.

శాస్త్రోక్తంగా సహస్ర రుద్రాభిషేకం



కన్యకా పరమేశ్వరి అమ్మవారికి తాంబూలం సమర్పిస్తున్న చీమకుర్తి మల్లికార్జునరావు, బోగనాథం శివకుమార్ తదితరులు

ప్యారీస్, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా వాసవి క్లబ్ షావుకారుపేట చెన్నై, వనిత క్లబ్, వైశ్య గురుసేవా సమితి తమిళనాడు విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సహస్ర రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం మహా మండపంలో లలితా సహస్రనామ పారాయణం, మహాశివరాత్రి కోసం ప్రత్యేకంగా 17 గ్రాముల బంగారంతో రూపొందించిన స్వర్ణలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్లబ్‌ల తరపున 532వ వారంగా పట్టువస్త్రాలు, పసుపు కుంకుమ తాంబూలంగా సమర్పించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు వరదాముత్తయప్పన్ వీధిలోని నారాయణగురవయ్య చెట్టి సత్రంలో శివపార్వతుల స్ఫటిక, స్వర్ణలింగాలకు సహస్ర రుద్రాభిషేకాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. క్లబ్‌ల డిస్ట్రిక్ ఇన్‌చార్జి బోగనాథం శివకుమార్, అధ్యక్షులు చీమకుర్తి మల్లికార్జునరావు, నాగలక్ష్మి, ట్రెజరర్లు కె.ప్రవీణ్‌కుమార్, శివరంజని దంపతులు, రీజియన్ చైర్‌పర్సన్ ముంజులూరు మురళీమోహన్ తదితరులు మహాశివరాత్రి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పాల్గొన్న మహిళలందరికి పసుపు కుంకుమలు, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

అమల్లోకి వచ్చిన హైకోర్టు ఉత్తర్వు

- పళని గిరిప్రదక్షిణ మార్గంలో 8 మార్గాల మూత





కొడైకెనాల్ - పళనిమార్గంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బారికేడ్లు - బోసిపోయిన వాహనాల పార్కింగ్ స్థలం

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వు మేరకు పళని పర్వతాలయం గిరి ప్రదక్షిణ మార్గంలోని ఎనిమిది మార్గాలు మూతపడ్డాయి. పళని గిరి ప్రదక్షిణ మార్గంలో ప్రైవేటు వాహనాల పార్కింగ్‌కు అనుమతిస్తున్నారని, ఆక్రమిత స్థలాల్లో అక్రమంగా దుకాణాలు నడుపుతుండటం వల్ల భక్తులకు తీవ్ర అసౌకర్యాలు ఏర్పడుతున్నాయంటూ హైకోర్టు మదురై డివిజన్‌లో ఓ పిటిషన్ దాఖలైంది. ఆ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు గిరి ప్రదక్షిణ మార్గంలో ప్రైవేటు వాహనాలను అనుమతించకూడదని, ఆలయం చుట్టూ ఉన్న ఉన్న వీధులను వ్యాపారాలకు ఉపయోగించకూడదని ఉత్తర్వులు జారీ చేస్తూ, మార్చి ఎనిమిదిలోగా అమలు చేయాలని ఆదేశించింది. ఆ మేరకు శుక్రవారం ఉదయం నుంచే గిరి ప్రదక్షిణ మార్గాన్ని కలిపే తొమ్మిది అనుబంధ రహదారులలో ఎనిమిది రహదారులను అధికారులు మూసివేశారు. బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాలను రానివ్వకుండా అడ్డుకున్నారు. కొడైకెనాల్ నుంచి వచ్చే రహదారిని మాత్రం తెరచి ఉంచారు. ఆ రహదారిలో తాత్కాలిక గేట్ ఏర్పాటు చేశారు. ఆ మార్గంలో ఆలయ అధికారులు, బ్యాంక్, కోర్టు అధికారులు వచ్చి వెళ్లేందుకు వీలుగా ఆ తాత్కాలిక గేట్ ఏర్పాటు చేశారు.

వ్యాపారుల బంద్... : ఇదిలా ఉండగా గిరి ప్రదక్షిణ మార్గాన్ని కలిపే తొమ్మిది రహదారులలో వాహనాల సంచారాన్ని నిషేధించి బారికేడ్లు ఏర్పాటు చేయడంపై వ్యాపారులు ఆగ్రహం ప్రకటించారు. శుక్రవారం తమ దుకాణాలను మూసివేసి బంద్ పాటించారు. వ్యాపారులంతా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేసి, ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు.

ఈబీ యాప్ 50 వేల మంది డౌన్‌లోడ్

ఐసిఎఫ్, మార్చి 8: విద్యుత్ బోర్డు యాప్‌ను 50 వేల మంది డౌన్‌లోడ్ చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ ఛార్జీలు ఎక్కడి నుంచైనా చెల్లించే టాన్‌జెడ్కో మొబైల్ యాప్‌ను 2018లో రాష్ట్ర విద్యుత్ బోర్డు పరిచయం చేసింది. ఈ యాప్‌ను 15,500 మంది డౌన్‌లోడ్ చేసుకొని వినియోగిస్తున్నారు. ఈ యాప్‌లో 'కంప్లైంట్' అనే ఫిర్యాదు చేసే సౌకర్యాన్ని ఫిబ్రవరి 12వ తేది కల్పించారు విద్యుత్ కోత, మీటరు రిపేరు, విద్యుత్ బిల్లులు, అగ్ని ప్రమాదాలకు సంబంధించిన ఫిర్యాదులు చేయవచ్చు. ఈ యాప్‌ను ఈ నెల 2వ తేది నుంచి 51,629 మంది డౌన్‌లోడ్ చేసుకున్నట్లు ఈబీ అధికారులు తెలిపారు.

డ్రైనేజీ నీరు తొలగింపు వాహనాల కొనుగోలుకు రుణసాయం

అడయార్, మార్చి 8: పారిశుధ్య కార్మికులను ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వీలుగా 213 మందికి అత్యాధునిక సౌకర్యాలతో కూడిన డ్రైనేజీ వాటర్ తొలగింపు వాహన యంత్రాల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం చేసింది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ ఆర్థిక సాయాన్ని అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 213 మందికి రూ.61.29 కోట్ల రాయితీతో రూ.125.86 కోట్ల రుణాన్ని సీఎం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐదుగురికి సీఎం స్టాలిన్ చేతుల మీదుగా రుణసాయం చేయగా, మిగిలిన వారికి ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ ఉన్నతాధికారులు అందజేశారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి టీఎం అన్బరసన్, పురపాలక మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి కార్తికేయన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహిళలే సమాజ ప్రగతికి వెలుగుదివ్వెలు

- విశ్రాంత ఆచార్యులు క్లారా సుహాసిని

ప్యారీస్, మార్చి 8: మహిళలే సమాజ ప్రగతికి వెలుగు దివ్వెలని ఆంధ్రప్రదేశ్ రాజమండ్రికి చెందిన విశ్రాంత ఆచార్యులు క్లారా సుహాసిని పేర్కొన్నారు. స్థానిక పెరంబూర్‌లోని వాటర్‌బరి మెమోరియల్ తెలుగు బాప్టిస్టు సంఘం (డబ్ల్యూఎంటీబీసీ) స్త్రీల సమాజం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కోలాహలంగా జరుపుకున్నారు. సంఘ సీనియర్ కాపరి రెవ.డా.ఎం.పాల్‌ఈశ్వరప్ప, అసిస్టెంట్ పాస్టర్ రెవ.ఆరూన్ దయాన్, రెవ.పి.మదన్‌మోహన్ ప్రత్యేక ప్రార్థనల అనంతరం ప్రారంభమైన ఈ వేడుకలకు స్త్రీల సమాజం అధ్యక్షురాలు మధురాణి శ్యాంసన్ సారధ్యం వహించారు. కార్యదర్శి పద్మ శ్యాంసన్, ట్రెజరర్ రాణి సురేష్, అసిస్టెంట్ సెక్రటరీ నమోమి మల్లికార్జున్‌ల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా క్లారా సుహాసిని పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు బీఎస్ జీవన్‌బాబు, కార్యదర్శి గొడిపేరు నాగేశ్వరరావు, ట్రెజరర్ ఎన్.పాల్ నాగేశ్వరరావు, స్త్రీల సమాజం సభ్యులు పాల్గొన్నారు.

వేదగిరీశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు



శంఖాన్ని దర్శించుకుంటున్న భక్తులు

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తిరుక్కళకుండ్రం లోని వేదగిరీశ్వరాలయం తీర్థకొలను (శంకుతీర్థం)లో 12 యేళ్ల తర్వాత ఆవిర్భవించిన అరుదైన శంఖాన్ని దర్శించేందుకు భక్తులు బారులు తీరారు. ఆ తీర్థకొలనులో ప్రతి పన్నెండేళ్లకొసారి తీర్థకొలనులో శంఖం ఉద్భవిస్తుంది. ఆ మేరకు 2011 సెప్టెంబర్‌లో శంఖం ఆవిర్భవించింది. తరువాత గురువారం ఉదయం ఆ తీర్థకొలనులో ఓ శంఖం ఆవిర్భవించింది. ఆలయ నిర్వాహకులు ఆ శంఖాన్ని పల్లకీలో ఆలయం వద్దరు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఓ వేదికపై శంఖాన్ని ఉంచి పూలతో అలంకరించారు. తరువాత భక్తులు ఆ శంఖాన్ని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం నుండి ఆ పవిత్ర శంఖాన్ని దర్శించేందుకు వేల సంఖ్యలో భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. ఈ నెల 13 వరకు ఈ శంఖాన్ని దర్శించుకునేందుకు అనుమతించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పొత్తుపై త్వరలో నిర్ణయం

- డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

ప్యారీస్, మార్చి 8: లోక్‌సభకు త్వరలో జరుగనున్న ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు కుదుర్చుకోవాలన్న నిర్ణయాన్ని త్వరలోనే వెల్లడిస్తామని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత పేర్కొన్నారు. కోయంబేడులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... తమ పార్టీతో పొత్తు కుదుర్చుకొనేందుకు అన్నాడీఎంకే, బీజేపీ పోటీపడుతున్నాయని, కూటమిలో చేర్చుకోవడంపై రాయబారాలు చేస్తున్నాయన్నారు. తాము నెలరోజుల ముందు నుంచే 14 లోక్‌సభ స్థానాలు, ఒక రాజ్యసభ స్థానం కేటాయించాలని కోరుతున్నామని, అయితే దీనిపై ఇప్పటివరకు బీజేపీ, అన్నాడీఎంకేల నుంచి స్పష్టమైన సమాధానం లేదన్నారు. ఎన్నికల కోడ్ ప్రకటించేందుకు ఇంకా సమయం ఉన్నందున తమ పార్టీ పెద్దలతో కలసి చర్చించి వీలైనంత త్వరలోనే పొత్తులపై సరైన నిర్ణయాన్ని తెలియజేస్తామని ప్రేమలత తెలిపారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



ప్యారీస్, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కాలాజ్ఞనబ్రహ్మా శ్రీమద్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. కొరట్టూరులోని ఆశ్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉదయం 6.30 గంటలకు గోవిందమాంబ సమేత స్వామివార్లకు అభిషేకపూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు లోకకల్యాణార్థం నిర్వహించిన ఈ కల్యాణోత్సవానికి నగరం నలుమూలల నుంచి భక్తులు హాజరయ్యారు. ట్రస్ట్ అధ్యక్షుడు టి.వీరభద్రరావు, కార్యదర్శి ఏఎస్ బలరామమూర్తి, కోశాధికారి ఎన్.కిషోర్, ట్రస్టీ కాశి సీతారామశర్మ, ఇతర కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించి, భక్తులందరికి తీర్థ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్త తునై సెల్వరాజ్ బ్రహ్మాగారి చరిత్ర కథా రూపంలో ఉపదేశించారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో శివయాగం నిర్వహించి రాత్రి 8 నుంచి నాలుగు జాముల పూజలను భక్తిపరవశంతో నిర్వహించారు.

ప్రశాంత్ హాస్పిటల్‌లో బ్రెస్ట్ క్యాన్సర్ కన్సల్టేషన్ క్యాంపు



మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రశాంత్ హాస్పిటల్ వైద్య బృందం, సిబ్బంది

అడయార్, మార్చి 8: నగరంలోని ప్రశాంత్ హాస్పిటల్ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా పోలీసుల కోసం నెల రోజుల పాటు ఉచిత మెమోగ్రామ్, బ్రెస్ట్ క్యాన్సర్ కన్సల్టేషన్ క్యాంపు నిర్వహించనుంది. ఈ విషయాన్ని ఆ హాస్పిటల్ చైర్‌పర్సన్ గీతా ప్రియ, ప్రశాంత్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సంహిత, ప్రశాంత్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ కృష్ణ శుక్రవారం వెల్లడించారు. ఈ విషయంపై గీతా ప్రియ మాట్లాడుతూ, మహిళా పోలీస్ అధికారులకు ఉచిత మె మోగ్రామ్ స్క్రీనింగ్‌లను అందించడం ఎంతో ముఖ్యమన్నారు. ఛైర్మన్ ప్రశాంత్ కృష్ణ మాట్లాడుతూ, కొళత్తూరులోని ప్రశాంత్ హాస్పిటల్‌లో ఈ మెమోగ్రామ్ పరీక్షలను అత్యాధునిక యంత్ర సదుపాయంతో నిర్వహిస్తామన్నారు. నెల రోజుల పాటు సాగే ఈ క్యాంపులో కొళత్తూరు పరిసరాల్లో ఉండే మహిళా పోలీసులు తమ సమయానుకూలంగా ఈ పరీక్షలు చేయించుకోవచ్చని ఆయన తెలిపారు.

'మాస్' సీనియర్ సభ్యుడు మారయ్య మృతి



(ఫైల్ ఫొటో)

ప్యారీస్, మార్చి 8: సంఘ సేవకుడు, 'మాస్' సీనియర్ సభ్యుడు గుర్రం మారయ్య (74) అనారోగ్యం కారణంగా స్థానిక వాషర్‌మెన్‌పేట సమీపంలోని పెన్షనర్స్ లైన్‌లో శుక్రవారం ఉదయం మరణించారు. రైల్వే శాఖలో 2010 వరకు సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేసి పదవీవిరమణపొందిన ఆయన, వాషర్‌మెన్‌పేటలోని చెన్నై ఉర్దూ పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషిచేశారు. ఆయన మృతికి మాస్ అధ్యక్షుడు డా.కొల్లి రాజు సంతాపం తెలిపారు.

కోవై సీటు కోసం పోటాపోటీ

అడయార్, మార్చి 8: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, కోయంబత్తూరు సౌత్ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ పోటీపడుతున్నారు. ఈ సీటు విషయంపై వారిద్దరి మధ్య టగ్ ఆఫ్ వార్ జరుగుతున్నట్టు ప్రచారం సాగుతుంది. పార్లమెంట్ ఎన్నికల కోసం బీజేపీ సారథ్యంలో మెగా కూటమి ఏర్పాటు చేసేందుకు అన్నామలై ముమ్మరంగా ప్రయత్నిస్తున్నపటికీ అవి ఏమాత్రం సఫలం కావడం లేదు. అన్నాడీఎంకే కూటమిలో చేరేందుకు రాష్ట్ర నేతలతో పాటు ఢిల్లీ పెద్దలు చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఉన్న 40 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసేందుకు ఒక్కో స్థానానికి ముగ్గురేసి చొప్పున అభ్యర్థులను ఎంపిక చేసిన అన్నామలై ఆ జాబితాను పార్టీ పెద్దలకు పంపించారు. ఇందులో కోయంబత్తూరు లోక్‌సభ స్థానం సీటును తనకు కేటాయించాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వద్ద అన్నామలై ప్రతిపాదన చేసినట్టు వార్తలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన కోయంబత్తూరు సౌత్ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్... ఆ సీటు తనకు కావాలంటూ పట్టుబట్టారు. ఈ స్థానం నుంచి అన్నామలై పోటీ చేస్తే జిల్లాలో తాను పట్టు కోల్పోతానని ఆమె ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా, అన్నామలై ఎంపీగా పోటీచేయాలని భావిస్తే ఆయన సొంత జిల్లా అయిన కరూర్ లోక్‌సభ నుంచి పోటీ చేయాలని సూచిస్తున్నారు. అయితే, బీజేపీ పెద్దలు మాత్రం కోవై సీటును ఎవరికి కేటాయిస్తారన్నదానిపై ఇపుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ప్రధానిని విమర్శించే స్థాయి కనిమొళికి లేదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై



మీడియాతో మాట్లాడుతున్న అన్నామలై

ప్యారీస్, మార్చి 8: మహిళాభ్యున్నతికి రోజుకో పథకాన్ని ప్రవేశపెడుతూ ప్రపంచదేశాల మెప్పు పొందిన ప్రధాని నరేంద్ర మోదీని విమర్శించేందుకు డీఎంకే ఎంపీ కనిమొళికి ఎలాంటి హక్కు లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సూచించారు. ఆయన నగరంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఇల్లు అద్దెకు తీసుకొని ప్రధాని మోదీ రాష్ట్రంలో మకాం వేసినా రాష్ట్రప్రజలు బీజేపీకి ఓటు వేయరని కనిమొళి విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పేరు చెప్పుకొని బతుకుతున్న వారి పేరులో కరుణానిధి అన్న పదం తొలగిస్తే ఆమె ఎవరని ప్రశ్నిస్తారన్నారు. ఉన్నతమైన పదవుల్లో ఉన్న వ్యక్తి గురించి విమర్శించే ముందు తమ స్థాయి ఏమిటో గ్రహించి మాట్లాడాలనే కనీస జ్ఞానం కూడా కనిమొళికి లేదని అన్నామలై మండిపడ్డారు.

నీడామంగళంలో బయల్పడిన విగ్రహం



గోతిలో బయల్పడిన విగ్రహం

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నీడామంగళం తాలూకా పెరుమాళ్‌కరం గ్రామంలోని పెరుమాళ్ కోవిల్ వీధిలో నివసిస్తున్న పూల వ్యాపారి కళియపెరుమాళ్ శుక్రవారం ఉదయం ఇంటి నిర్మాణం కోసం గోయి తవ్వినప్పుడు ఓ ప్రాచీన విగ్రహం బయల్పడింది. ఆ విగ్రహం అడుగున్నర ఎత్తు ఉంది. వెంటనే కళియపెరుమాళ్ విషయాన్ని నీడామంగళం తహసీల్దార్ తెలిపారు. వెంటనే తహసీల్దార్ ఆర్.దేవేంద్రన్, గ్రామనిర్వహణాధికారి రాజ్‌కుమార్, సర్పంచ్ కేపీపీ బాలాజీ తదితరులు అక్కడికి వెళ్లి విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ విగ్రహం ఆళ్వార్లలో ఒకరిదిగా ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ఈ విషయమై త్వరలో పురావస్తు పరిశోధన విభాగం అధికారులతో పరిశీలించి ఆ విగ్రహానికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

సృష్టిలో మహిళల పాత్ర గౌరవప్రదమైంది

- ఎంసీటీబీసీ మహిళా దినోత్సవంలో వక్తలు



స్త్రీల సమాజం సభ్యులతో రెవ.రాజేంద్రప్రసాద్, సొపాటి దానమ్మ

ప్యారీస్, మార్చి 8: సృష్టిలో మహిళల పాత్ర గొప్పదని, పరిపూర్ణమైన జీవితంతో మహిళామణులు ముందుకు సాగాలని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు (ఎంసీటీబీసీ) కాపరి రెవ.డా.ఎస్.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సంఘ స్త్రీల సమాజం ఆధ్వర్యంలో సంఘ ఆవరణలో ఏర్పాటుచేసిన వేడుకలను రాజేంద్ర ప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభించారు. పాస్టరమ్మ సొపాటి దానమ్మ, జె.జయమ్మ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వేడుకల్లో డా.ఎస్.అఖిల నవీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని దైవసందేశం అందించారు. అనంతరం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ యేసు బోధనలు అనుసరించి క్రైస్తవులు సమాజంలో అందర్నీ ప్రేమించాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జి.రామయ్య, ప్రధాన కార్యదర్శి పోతల ప్రభుదాస్, ట్రెజరర్ అనుమలగుర్తి బాబు, స్త్రీల సంఘం, యువజన విభాగం సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆ నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలి

- టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై

అడయార్, మార్చి 8: నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ)కు చెందిన షేర్లను ప్రైవేటు సంస్థలకు విక్రయించాలనే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ విషయంపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సహకారంతో నాటి ముఖ్యమంత్రి కామరాజర్ ఈ కంపెనీని స్థాపించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ సంస్థలో సుమారుగా 25 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారన్నారు. ఎన్ఎల్‌సీలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో 70 శాతం రాష్ట్రానికి సరఫరా అవుతుందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఎన్ఎల్‌సీలోని 7 శాతం షేర్లను విక్రయించి రూ.2 వేల నుంచి రూ.2,200 కోట్ల మేరకు నిధులను సేకరించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ షేర్ల విక్రయం కూడా ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరుగనుంది. తమిళనాడు రాష్ట్రాభివృద్ధిలో ఒక భాగస్వామిగా ఉన్న ఎన్ఎల్‌సీలోని తన నిధులను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించాలన్న నిర్ణయాన్ని కేంద్రం ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర స్థాయిలో ఉద్యమం చేయనున్నట్టు ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

ఏనుగుల దాడిలో అరటితోట ధ్వంసం

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా తాళవాడి ఫారెస్ట్‌రేంజ్‌లోని శేషన్ నగర్ ప్రాంతంలో విజయకుమార్ అనే రైతుకు చెందిన అరటితోటలో శుక్రవారం వేకువజాము రెండు అడవి ఏనుగులు చొరబడి అరటిపంటను ధ్వంసం చేశాయి. వెంటనే ఆయన చుట్టుపక్కల ఉన్న రైతుల సహాయంతో ఆ ఏనుగులను తరిమికొట్టేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఆ తోటలో ముప్పావు శాతం అరటి చెట్లు నేలకొరిగాయి. ఈ సంఘటనపై రైతులు పోలీసులు, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.







కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి - మహిళలకు పురస్కారాలు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు - నరువి ఆస్పత్రిలో వేడుకలు ప్రారంభిస్తున్న పోలీసు శాఖ అధ్యక్షులు సీమా అగర్వాల్

వాడవాడలా మహిళా దినోత్సవం

వేలూరు, మార్చి 8: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ సుబ్బులక్ష్మి కేక్ కట్ చేసారు. కార్యక్రమంలో రెవెన్యూ తహసీల్దార్ కవిత, సెల్వి సుబ్బులక్ష్మి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సుమతి, బీసీ శాఖ జిల్లా అధికారి సీత తదితరులు పాల్గొన్నారు.

డీకేఎం కళాశాలలో...

ఇండియన్ రెడ్‌క్రాస్ కాట్పాడి శాఖ, తమిళనాడు సైన్స్ ఇయక్కమ్ వేలూరు జిల్లా శాఖ, వేలూరు డీకేఎం కళాశాల (మహిళ) సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి తమిళనాడు సైన్స్ ఇయక్కం సెక్రటరీ జనార్ధనన్ అధ్యక్షత వహించగా, కళాశాల ప్రిన్సిపాల్ భానుమతి, తమిళనాడు సైన్స్ శాఖ జిల్లా అధ్యక్షుడు, ఆక్సీలియం కళాశాల లెక్చరర్ అముద, వేలూరు పెండెలెంట్ ఆసుపత్రి సీనియర్ నర్స్ కృష్ణన్, గాంగేయనల్లూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు నిర్మల, కాట్పాడి మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ మేరిగ్లోరియా, టీచర్ సిలంబరసి తదితరులు పాల్గొనగా, విభిన్న రంగాల్లో రాణిస్తున్న మహిళలకు అవార్డులు ప్రదానం చేశారు.

నరువి ఆసుపత్రిలో...

స్థానిక నరువి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆస్పత్రి అధ్యక్షుడు సంపత్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా పోలీసు శాఖ ప్రధాన డైరెక్టర్ సీమా అగర్వాల్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎక్స్‌రే డిపార్ట్‌మెంట్ అధ్యక్షుడు అశోక్ మిత్రా, క్యాన్సర్ విభాగం అధ్యక్షురాలు సింధు, ఆసుపత్రి డైరెక్టర్ పాల్ హెన్రీ, జనరల్ మేనేజర్ నితీష్ సంపత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

నగరంలో ర్యాలీ...

మహిళా దినోత్సవం సందర్భంగా మత్తుమందుల నిర్మూలన, క్యాన్సర్‌పై అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద ర్యాలీని వేలూరు ఎమ్మెల్యే కార్తికేయన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, అరుల్, ఆల్‌బాస్, మహమ్మద్ సఖీ, 500 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

జీఆర్‌టీ హోటల్స్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

పెరంబూర్: జీఆర్‌టీ హోటల్స్ రిసార్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను పురస్కరించుకొని ఈనెల 5,7 తేదీల్లో పలు ప్రాంతాల్లో నిర్వహించిన వంటల పోటీల్లో అనేక మంది మహిళలు పాల్గొన్నారు. నగరంలో జీఆర్‌టీ హోటల్స్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హోటల్స్ సీనియర్ జనరల్ మేనేజర్ మన్‌దీప్ జాస్ అధ్యక్షత వహించగా, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ చెఫ్ దాము హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చెఫ్ దాము, జీఆర్‌టీ హోటల్స్ సీజీఎం మన్‌దీప్‌జాస్


డేర్ డెవిల్ బైకర్స్ బృందం


మండుతున్న ఇనుప చక్రంలో దూసుకెళుతున్న సైనికుడు


మోటారు బైకులతో విన్యాసం


యుద్ధభూమిని తలపించే ప్రత్యేక విన్యాసం


అశ్వదళం ప్రదర్శన

ఓటీఏ పాసింగ్ అవుట్ ఫెరేడ్

● అలరించిన విన్యాసాలు

చెన్నై, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరంలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఓటీఏ)లో శిక్షణ పూర్తి చేసుకున్న సైనికాధికారులు శుక్రవారం నిర్వహించిన విన్యాసాలు చూపరులకు గగుర్పాటు కలిగించాయి. శిక్షణ పూర్తి చేసుకున్న 117 మంది పురుషులు, 31 మంది మహిళలు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించి ఉన్నతాధికారుల ప్రశంసలందుకున్నారు. ఓటీఏ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ సంజీవ్ చౌహాన్ నేతృత్వంలో ప్రత్యేక బ్యాండ్ బృందం వాద్య సంగీతంతో అశ్వాలపై పరుగులు తీస్తూ, తుపాకులు పట్టుకుని శత్రుసైన్యం వైపు విన్యాసాలు నిర్వహించారు. వందల సంఖ్యలో బైకులపై కూర్చుని సైనిక దళం చేసిన ప్రదర్శన కూడా చూపరులను మైమరపించాయి. వెళ్తున్న బైకులపై నిలబడి ఉన్నతాధికారులకు సెల్యూట్ చేసిన దృశ్యాలు బాగా ఆకట్టుకున్నాయి. మండుతున్న ఇనుప వలయాల మధ్య వివిధ భంగిమలతో చేసిన విన్యాసాలు కూడా అలరించాయి. అంతే కాకుండా డేర్ డెవిల్ మోటార్ సైకిల్ దళం త్రికోణాకారంలో నడుపుతూ ఇరువైపులా భారత సైనిక పతాకాలు, మధ్యలో జాతీయ పతకాన్ని పట్టుకుని మైదానం చుట్టూ తిరిగి విన్యాసాలకు ముక్తాయింపు పలికారు. వీటన్నింటికి తోడు కేరళ మలబార్ ప్రాంతంలో పేరొందిన కలరిపాయట్టు విన్యాసాలు కూడా నిర్వహించారు. చివనగా విన్యాసాలలో పాల్గొన్నవారికి లెఫ్టినెంట్ జనరల్ సంజీవ్ చౌహాన్ బహుమతులు పంపిణీ చేశారు.


బ్యాండ్ వాద్య బృందం సభ్యులు



నో పాలిటిక్స్... ఓన్లీ మూవీస్

● హాస్య నటుడు వడివేలు

ప్రముఖ హాస్య నటుడు వడివేలు రాజకీయ రంగ ప్రవేశంపై జోరుగా వార్తలు వస్తున్నాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అధికార డీఎంకే తరపున లోక్‌సభ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారనే ప్రచారం సాగుతుంది. దీనిపై వడివేలు గురువారం క్లారిటీ ఇచ్చారు. 'ప్రస్తుతానికి రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచనగానీ, వ్యూహంగాని లేదు. కేవలం సినిమాలపైనే దృష్టిని కేంద్రీకరించాను. నాకు సినిమాలు మినహా మరో ధ్యాస లేదని పునరుద్ఘాటించారు. కాగా, కోలీవుడ్‌లో తన కామెడీతో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించిన వడివేలు ఒకానొక సమయంలో హీరో పాత్రలు కూడా చేశారు. అలా మంచి పీక్‌లో ఉన్న సమయంలో ఆయన అనుకోకుండా రాజకీయాల్లోకి తలదూర్చి... డీఎంకేకు అనుకూలంగా ప్రచారం చేశారు. పనిలోపనిగా దివంగత నటుడు విజయ్‌కాంత్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వడివేలు, విజయకాంత్‌ల మధ్య మాటల యుద్ధమే జరిగింది. అయితే, ఆ ఎన్నికల్లో డీఎంకే చిత్తుగా ఓడిపోయింది. దీంతో వడివేలుకు సినిమా అవకాశాలు లేకుండాపోయాయి. దాదాపు దశాబ్దకాలం పాటు ఆయన చిత్రపరిశ్రమకు దూరంగా ఉన్నారు. గత యేడాది 'నాయ్ రిటర్న్స్' పేరుతో మళ్ళీ సినిమాల్లోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం తనకు వస్తున్న సినిమా అవకాశాలను వినియోగించుకుంటూ కెరీర్‌ను నిర్మించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే తరపున పటీ చేయనున్నారంటూ వస్తున్న వార్తలను ఆయన ఖండించారు.

ఆరి అర్జునన్ హీరోగా 'రిలీజ్'

నటుడు ఆరి అర్జునన్ హీరోగా గ్రిప్పింగ్ థ్రిల్లర్‌గా కొత్త తెరకెక్కనుంది. 'రిలీజ్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ మూవీ పూజా కార్యక్రమం గురువారం చెన్నైలో జరిగింది. ఇందులో చిత్రంలో నటించే నటీనటులతో టెక్నీషియన్లందరూ పాల్గొన్నారు. మనో క్రియేషన్స్ బ్యానరుపై నిర్మాత రాజా నిర్మించే ఈ చిత్రానికి ఎల్.ఆర్.సౌందర్‌పాండియన్ దర్శకత్వం వహిస్తున్నారు. చెన్నైలోని ఒక అపార్టుమెంట్‌లో జరిగే స్క్రీన్‌ప్లేతో గ్రిప్పింగ్ థ్రిల్లర్‌గా, అనేక ట్విస్టులతో దర్శకుడు రూపొందించనున్నారు. ఒకే షెడ్యూల్‌లో చిత్రీకరణ పూర్తి చేసుకునే ఈ చిత్రంలో ఆరి అర్జునన్ సరసన దీప్షిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇతర పాత్రలను ఆరాధ్య, సుబ్రమణ్యశివ, ఆదిత్య కదిర్ తదితరులు పోషిస్తున్నారు. చెన్నై నగరంలో ప్రత్యేకంగా ఎంపిక చేసిన ఒక అపార్టుమెంట్‌లోనే షూటింగ్ జరుపనున్నారు. జే లక్ష్మిణ్ ఛాయాగ్రహణం అందించే ఈ చిత్రానికి సంగీతం ఎస్.శంకర్ రామ్ సమకూర్చనున్నారు.


ఆరి అర్జునన్

చిత్రజ్యోతి

తమిళ సినీ దర్శకుల సంఘ ఎన్నికలు

● ఆ ముగ్గురు ఏకగ్రీవం

తమిళనాడు చిత్రపరిశ్రమ దర్శకుల సంఘం ఎన్నికలు ఈ నెల 16వ తేదీ జరుగనున్నాయి. ప్రతి రెండేళ్ళకు ఒకసారి జరిగే ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి మళ్ళీ పోయడం లేదని ప్రముఖ దర్శకుడు ఆర్.కె.సెల్వమణి ప్రకటించారు. దీంతో అధ్యక్ష పదవికి సినీ దర్శకుడు ఆర్.వి.ఉదయకుమార్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అదేవిధంగా, ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుతం ఈ సంఘానికి కోశాధికారిగా ఉన్న పేరరసు ఎంపికయ్యారు. అలాగే, కోశాధికారిగా మాత్రం శరణ్ ఎంపికయ్యారు. 2024-26 సంవత్సరానికిగాను జరిగే ఈ ఎన్నికల్లో మిగిలిన పోస్టులకు మాత్రం ఈ నెల 16వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, ఫెఫ్సీ అధ్యక్షుడిగా ఉన్న ఆర్‌కె సెల్వమణి.. తమిళ సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడిగా కూడా కొనసాగారు. అయితే, ఈ దఫా ఆయన పోటీ నుంచి తప్పుకోవడం ఇపుడు చర్చనీయాంశంగా మారింది.


ఆర్.వి.ఉదయకుమార్, పేరరసు

మహత్ - మీనాక్షి జంటగా 'కాదలే కాదలే'


'కాదలే కాదలే' చిత్ర బృందం

యువనటుడు మహత్ రాఘవేంద్ర - మీనాక్షి గోవిందరాజన్ జంటగా 'కాదలే కాదలే' పేరుతో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్ తాజాగా పూర్తయింది. ప్రముఖ నిర్మాత పా.రంగనాథన్ తన సొంత నిర్మాణ సంస్థ శ్రీవారి ఫిలిమ్స్ బ్యానరుపై తెరకెక్కిస్తుండగా ప్రేమనాథ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేక్షకులన మెప్పించే అనేక వినోదాత్మక చిత్రాలను రూపొందించడంలో పేరొందిన శ్రీవారి ఫిలిమ్స్ ఈ సినిమాను పక్కా ప్లానింగ్‌తో పూర్తి చేసింది. ఈ సినిమా గురించి నిర్మాత పా.రంగనాథన్ మాట్లాడుతూ, 'ఒక గొప్ప సినిమా తీయడమే కాదు.. సెట్‌లో అన్ని సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు అనుకున్నదంతా పక్కాగా చేయడం దర్శకుడి నైపుణ్యం. దర్శకుడు ప్రేమనాథ్ ఈ నైపుణ్యాన్ని బాగా ప్రదర్శించి ఎలాంటి అవాంతరాలు లేకండా సినిమా చిత్రీకరణ పూర్తి చేయడం సంతోషంగా ఉంది. మహత్ రాఘవేంద్ర నటన అద్భుతంగా ఉంది. మీనాక్షి ఇండస్ట్రీకి ఒక వరం. ఇప్పటికే పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయి. త్వరలోనే ఆడియో, ట్రైలర్‌తో పాటు విడుదల తేదీని వెల్లడిస్తాం. ఈ సినిమా 'విన్నైతాండి వరువాయా', 'జో' తరహాలో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటుంది' అని పేర్కొన్నారు. ఇందులో భారతీరాజా, శ్రీజా రవి, వీటీవి గణేష్, రవీనా, రాజ్ అయ్యప్ప తదితరులు నటించారు. సుదర్శన్ గోవిందరాజన్ ఛాయాగ్రహణం అందించగా 'సీతారామం' ఫేం విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూర్చారు.


క్లాస్ టాపర్లతో ముఖ్యఅతిథి గోమతి నరసింహన్, నిర్వాహకులు

ఎస్కేపీసీలో ఘనంగా మహిళా దినోత్సవం

ప్యారీస్, మార్చి 8: స్థానిక జార్జిటౌన్‌లో ప్రసిద్ధిచెందిన శ్రీ కన్యకా పరమేశ్వరి (ఎస్కేపీసీ) ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. రేలా ఆసుపత్రి ఛైర్మెన్ డా.గోమతి నరసింహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్లాస్ టాపర్లు, 100 శాతం అటెండెన్స్, శాఖలవారీగా బెస్ట్ అవుట్‌గోయింగ్ స్టూడెంట్లకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు పంపిణీ చేసి అభినందించారు. వేడుకల్లో భాగంగా స్టూడెంట్స్ కౌన్సిల్ సభ్యులను శాలువతో ఘనంగా సత్కరించారు. ఫ్యాషన్ డిజైనింగ్, జ్యువెలరీ మేకింగ్, బ్యాంకింగ్, బ్యూటీషియన్, ఫుడ్ కోర్ట్ తదితరాలు ఏర్పాటుచేశారు. కళాశాల కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్, ప్రిన్సిపాల్ డా.టి.మోహనశ్రీ సహా అధ్యాపకులు, విద్యార్థినులు పెద్దసంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

శ్రీరామచంద్రలో ఘనంగా మహిళా దినోత్సవం



వేడుకల్లో అతిథులు, నిర్వాహకులు

ప్యారీస్, మార్చి 8: స్థానిక పోరూర్‌లోని శ్రీరామచంద్ర ఉన్నత విద్య పరిశోధన సంస్థ (డీమ్డ్ యూనివర్సిటీ) ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రాంగణంలో ఉన్నత విద్య, పరిశోధన శాఖకు చెందిన సుమారు 500 మందికి పైగా విద్యార్థినులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది కలిసి సాటి మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అడ్డుకొనేందుకు సమష్టి కృషితో ఉద్యమించాలని ప్రతినబూనారు. ఈ వేడుకల్లో వైస్ చాన్సలర్ డా.ఉమా శేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రూబా నాగరాజన్, పరిశోధన విభాగం ఛైర్మెన్ డా.కల్పన బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ... శ్రీరామచంద్ర ఉన్నత విద్యాసంస్థలో పురుషుల కంటే అధికంగా విద్యార్థినులు, మహిళలు అధ్యాపకులుగా ఉండడం గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. యాజమాన్యం విద్యార్థులకు మంచి భవిష్యత్తు కలిగేలా అన్ని సదుపాయాలు సమకూర్చి ప్రోత్సహిస్తోందని ఆయన తెలిపారు.





పురుషవాక్కం గంగాధీశ్వర ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ - దర్శనం కోసం పోటెత్తిన భక్తులు







మహాశివరాత్రి సందర్భంగా భక్తులను ఆకట్టుకుంటున్న శివయ్య విగ్రహాలు

హరహర మహాదేవ

● భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు

ప్యారీస్, మార్చి 8: రాజధాని నగరం చెన్నైలో మహాశివరాత్రి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శివాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. శివరాత్రి సందర్భంగా శివాలయాలను మామిడి, అరటి తోరణాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. రద్దీలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా నగర పోలీసులు భద్రత కల్పించారు. మైలాపూర్ కపాలీశ్వర ఆలయం, ట్రిప్లికేన్‌లోని తిరువటీశ్వరాలయం, తీర్థపాలేశ్వరాలయం, సైదాపేట కారుణీశ్వరాలయం, వ్యాసర్పాడి రవీశ్వరాలయం, పురుషవాక్కం గంగాధీశ్వరాలయం, విల్లివాక్కం అగస్తీశ్వర ఆలయం, టీ.నగర్ శివ విష్ణు ఆలయం తదితర ఆలయాల్లో ఉదయం నుంచే భక్తుల సందర్శన అధికమైంది. అలాగే, కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సాయంత్రం 4 గంటలకు మొదటి జాము పూజ, శివలింగం, సాలగ్రామాలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు దీపారాధన, అనంతరం నాట్యార్పణ ఆర్ట్స్ అకాడమి విద్యార్థుల భరతనాట్య ప్రదర్శన, భక్తిగీతాల సంగీతం, 9.45 గంటలకు రెండవ జాము పూజలు, అర్ధరాత్రి 12.45 గంటలకు మూడవ జాము, వేకువజామున 2.45 గంటలకు నాలుగవ జాము పూజలతో శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి.

'ఫెయిర్ ప్రో-2024' ప్రారంభించిన నటి సుహాసిని

అడయార్, మార్చి 8: నగరంలో 'ఫెయిర్‌ప్రో-2024' ఎగ్జిబిషన్‌ను ప్రముఖ సినీ నటి సుహాసిని మణిరత్నం శుక్రవారం ప్రారంభించారు. క్రెడాయ్ చెన్నై విభాగం ఆధ్వర్యంలో జరిగే 16వ ఎడిషన్ అతిపెద్ద రియల్ ఎస్టేట్ ఎగ్జిబిషన్‌ప్రారంభోత్సవంలో బ్రాండ్ అంబాసిడర్‌లు అయిన సుహాసిని, ప్రియ భవానీ శంకర్‌లతో పాటు క్రెడాయ్ మాజీ అధ్యక్షులు చిట్టిబాబు, సురేష్ కృష్ణ, హబీబ్, పదం దుగర్, ప్రస్తుత అధ్యక్షుడు శివగురునాథన్, ఎస్‌బీఐ సీజీఎం రవి రంజన్, కార్యదర్శి కృతివాస్, ఫెయిర్‌ప్రో 2024 కన్వీనర్ అస్లాం పకీర్ మొహ్మద్ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ రియల్ ఎస్టేట్ ఎగ్జిబిషన్‌లో 75 రియల్ ఎస్టేట్ కంపెనీలకు చెందిన దాదాపు 200కుపైగా ప్రాపర్టీస్ ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచారు.



'ఫెయిర్‌ప్రో-2024' ప్రారంభోత్సవంలో సుహాసిని, నిర్వాహకులు

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా కామరాజర్‌సాలైలోని అవ్వయార్ విగ్రహం కూడలి వద్ద ఆమె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు సామినాథన్, గీతా జీవన్, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియా, డిప్యూటీమేయర్ మహేష్‌కుమార్, చెన్నై కలెక్టర్ రష్మీ సిద్ధార్థ్ జక్టే తదితరులు




రాజ్‌భవన్‌లో అవ్వయార్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి

నేత్రపర్వంగా పుష్పయాగం


పద్మావతి తాయార్‌కు పుష్పాంజలి దృశ్యాలు



ప్యారీస్, మార్చి 8: స్థానిక టి.నగర్ జీఎన్.శెట్టి రోడ్డులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం నేత్రపర్వంగా పుష్పయాగం నిర్వహించారు. అమ్మవారిని అలంరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అర్చర స్వాములు దాదాపు 12 రకాల పుష్పాలు,తులసి తదితర పత్రాలతో అమ్మవారికి పుష్పయాగం నిర్వహించారు. ఈ పూజలో టీటీడీ స్థానిక సలహా మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, ఆయన సతీమణి జయశ్రీ, ఆలయ సూపరింటెండెంట్ పుష్పలత, సభ్యులంతా సంప్రదాయ వస్త్రాలు ధరించి అమ్మవారి సేవలో పాల్గొన్నారు.